క్లుప్తంగా

నేడు మున్సిపల్ సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు. అజెండాలోని పలు అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి ఆమోదిస్తారని పేర్కొన్నారు.

పశువైద్యశాల ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ డాక్టర్ లక్ష్మీదేవి

అట్లూరు : అట్లూరు పశువైద్యశాలను ఏవీహెచ్ ఏడీ డాక్టర్ లక్ష్మీదేవి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది విధినిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో అనిమల్ హజ్బెండరీ అసిస్టెంట్ (ఏహెచ్‌ఏ)లకు పశువైద్యాధికారులు శిక్షణ నిర్వహించాల్సి ఉండగా స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ శిరీష విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

కారు స్వాధీనం

మైదుకూరు : మండలంలోని బసవాపురం సమీపంలో లంకమల అడవుల్లో శుక్రవారం కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ అధికారులు అక్కడ ఆపి ఉన్న కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో నిత్యావసర సరుకులు ఉండటంతో ఎర్రచందనం స్మగ్లర్లు తెచ్చుకొని ఉంటారని భావిస్తున్నారు. కారును బద్వేలుకు తరలించి విచారణ చేపట్టినట్టు తెలుస్తోంది.

ఎమ్మెల్యే పుట్టాకు ఘన స్వాగతం


అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

దువ్వూరు : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. దువ్వూరు మండలం ఇడమడక గ్రామ సమీపంలోని జిల్లా సరిహద్దు వద్ద శుక్రవారం పుట్టా సుధాకర్ యాదవ్‌కు టీడీపీ నాయకులు క్రేన్ సహాయంతో భారీ గజమాల వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కానగూడూరు, జిల్లెల్ల, దువ్వూరు, గుడిపాడు, చింతకుంట, మైదుకూరు, చాపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే అభినందన యాత్ర కొనసాగింది. ప్రతి గ్రామం వద్ద టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో చేరి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1 నుంచి అడ్మిషన్లు

బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ కోర్సులకు ఆగస్టు 1న అడ్మిషన్లు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ అనంత పద్మనాభమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 1న ఉదయం 11గంటలకు ఎస్ఎస్‌సీ ఒరిజనల్ మెమో, టీసీతో హాజరు కావాలన్నారు. పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు.

పార్వతీదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే మల్లె, జాజి, కనకాంభరం పూలు, 101 నిమ్మకాయలు వేసి అమ్మవారిని అర్చకుడు వెంకటాచలపతి శోభాయమానంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్రమపద్ధతి విధులతో ఒత్తిడి దూరం

వైవీయూ : అధ్యాపకులు క్రమపద్ధతిలో విధులు నిర్వర్తిస్తే ఒత్తిడి దూరం అవుతుందని అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు డి.లక్ష్మీనరసింహప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకంగా ఒత్తిడి ఎదుర్కొంటూనే ఉంటారన్నారు. తల్లి గర్భం మొదలు జీవితకాలం ఒత్తిడి ఉంటుందని, అయితే చేసే పనిని ఇష్టపూర్వకంగా చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఒత్తిడిని జయించే మార్గాలను వివరించారు. అనంతరం లక్ష్మీనరసింహప్రసాద్‌ను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

పోషణ భారం.. సాగుకు దూరం

ఒకప్పుడు పశువులతో కళకళలాడుతున్న గ్రామాలు నేడు కళాహీనంగా మారుతున్నాయి. ఆధునిక యంత్రాలు వ్యవసాయ రంగంలోకి రావడంతో సాగు ఉపయోగించే ఎద్దులు జాడ కనిపించడం లేదు. మూడు దశాబ్దాల క్రితం ప్రతి గ్రామంలో వ్యవసాయానికి ఉపయోగించే ఎద్దులతో పాటు పాలిచ్చే గేదెలు, ఆవులు వేల సంఖ్యలో ఉండేవి. కాలం గడుస్తున్న కొద్దీ అంతా మారిపోయింది. ట్రాక్టర్లు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు పనిముట్లు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు ఎద్దులు, పశువులతో పని లేకుండా పోయింది. ఆహార పంటల స్థానాన్ని వాణిజ్య పంటలు ఆక్రమించాయి. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. కొన్ని సంవత్సరాలు గడిస్తే గ్రామాల్లో పూర్తిగా పశుసంపద కనుమరు అయ్యే పరిస్థితి వస్తుందని పలువురు అంటున్నారు.


రాజుపాళెంలో ఎద్దులతో సేద్యం చేస్తున్న రైతు

- అంతరిస్తున్న పశు సంపద
- గ్రాసానికి గడ్డుకాలం
- పశు పోషణకు అన్నదాత విముఖత
- వ్యవసాయంలో యంత్రాలతే పై చేయి

రాజుపాళెం : దేశానికి వెన్నుముఖ రైతన్న అయితే... ఆ రైతన్నకు వెన్నుదన్ను పశుసంపద. ఆరుగాలం సాగు పనుల్లో అన్నదాత వెన్నంటే ఉంటూ.. తాము కుదేలవుతున్నా యజమాని చూపిన పనిచేస్తూ తోడునీడగా నిలుస్తాయి. పితికిన కొద్ది పాలిచ్చే గేదెలు రైతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. రైతులకు ఆసరాగా నిలిచే పశు సంపద రోజురోజుకు తగ్గిపోతుంది. పశువుల స్థానంలో యంత్రాలు (ట్రాక్టర్లు), పోషణ భారం కావడంతో అన్నదాతలు పశుసంపదను చాలా వరకు తగ్గించుకుంటున్నారు. గ్రామ సీమల్లో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి, వాటి స్థానంలో యంత్రాలు వచ్చాయి. రాజుపాళెం మండలంలో 2007 సంవత్సరంలో 1,595 ఆవులు, ఎద్దులు ఉండగా 2014 లెక్కల ప్రకారం 990, 2024 లో 300 ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో రైతన్నలు ప్రతి సీజన్‌లో పంట నష్టపోతున్నారు. పంటపై పెట్టిన పెట్టుబడులు తగ్గక, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయం చేయడమే దండగ అన్నట్లుగా భావిస్తున్నారు. పంటసాగే కష్టంగా మారుతున్న తరుణంలో పశుసందను ఏవిధంగా పోషించాలని రైతులు అంటున్నారు. వాటికి గ్రాసం దొరక్క పోవడంతో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందంటున్నారు. చేసేదేమిలేక వ్యవసాయ పనులు అయినపోయిన వెంటనే రైతన్నలు ఎద్దులను అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం గ్రామంలో నాలుగు నుంచి ఆరు జతల ఎద్లు మాత్రమే ఉన్నాయి.

పోషణ భారమై..

ప్రస్తుత పరిస్థితుల్లో పశువుల పోషణ రైతులకు భారంగా మారింది. ముఖ్యంగా పశువులకు మేత కొరత ఏర్పడుతుంది. ఆలనాపాలనా చూసుకునేందుకు కూలీలు కూడా దొరకక పోవడంతో రైతులు విముఖత చూపుతున్నారు. వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు రావడంతో పశుపోషణపై ఎక్కువ ప్రభావం చూపాయి. ఎద్దులు, కూలీలతో అవసరం లేకుండానే వ్యవసాయానికి అన్ని రకాల యంత్రాలు చేసే పనిముట్లు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కప్పుడు గ్రామాల్లో పశువులను పెంచడం పెద్దరికంగా భావించేవారు.

రైతులకు అవగాహన కల్పించాలి

పశుపోషణపై ప్రభుత్వం పలు రకాల పథకాలను అమలు చేస్తున్న సంబంధిత శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు. పాల దిగుబడిని పెంచేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం రైతులకు అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పశుసంపదను పెంచేందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులకు వివరించి, ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

పశుగ్రాసం కొరతతో ఇబ్బందులు



ప్రస్తుత కాలంలో పశుగ్రాసం కొరతతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వామి వేయాలంటే రూ.లక్షల్లో ఖర్చు ఎక్కువ అవుతోంది. దీనికి తోడు వ్యవసాయంలో చాలా మార్పులు రావడంతో ఎక్కువ మంది రైతులు యంత్రాలతోనే పనులు చేయించుకుంటున్నారు. దీంతో ఎద్దులతో పని తక్కువై పోయింది. దీనికి తోడు ఎద్దులకు ఖర్చులు కూడా అధికమవడంతో చాలామంది రైతులు అమ్ముకుంటున్నారు.

–వెంకటేశ్వర్లు, పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, రాజుపాళెం మండలం

ఎద్దులతోనే వ్యవసాయం చేస్తున్నా

పాతకాలంలో ప్రతి రైతు ఎద్దులతోనే వ్యవసాయం చేసేవాళ్లు. పాడి గేదెలు కూడా ఎక్కువగానే ఉండేవి. కాలానుగుణంగా చాలామంది రైతులు ఎద్దులను అమ్ముకొని ట్రాక్టర్లు తెచ్చుకుంటున్నారు. పాలిచ్చే గేదెలు ఒకటి, రెండు మాత్రమే రైతుల ఇళ్లలో ఉన్నాయి. నేను మాత్రం ఇప్పటికి ఎద్దులతోనే వ్యవసాయం చేస్తున్నా. పశుగ్రాసానికి ఇబ్బందిగా ఉంది. అందువల్ల కొందరు రైతులు ఎద్దులను సీజన్ అయిపోయిన వెంటనే విక్రయిస్తున్నారు.

–శివరామిరెడ్డి, రైతు, రాజుపాళెం మండలం

సీఎస్ఐ డయాసిస్ చైర్మన్‌గా సాల్మన్


చైర్మన్ సాల్మన్‌ను సత్కరిస్తున్నట్లు పాస్టర్లు

మైదుకూరు : సీఎస్ఐ డయాసిస్ మైదుకూరు డివిజన్ చైర్మన్‌గా సాల్మన్ నియమితులయ్యారు. శుక్రవారం స్థానిక సీఎస్ఐ షాలోమ్ టౌన్ చర్చిలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సాల్మన్ ఆధ్వర్యంలో డివిజన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో డివిజన్ పాస్టర్లు ఆర్ఎస్ వినయ్ కుమార్, బి.రాజేంద్ర, పి.ప్రేమ్‌కుమార్, ఆయా సంఘాల డివిజన్ కమిటీ మెంబర్లు డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ సాల్మన్‌ను సత్కరించారు.

నేడు ఎముకల సాంద్రతపై ఉచిత పరీక్షలు

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డులోని బంగారుశీనయ్య ఆస్పత్రిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత ఎముకల సాంద్రత పరీక్షల వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బంగారుశీనయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉచిత వైద్యశిబిరంలో రూ.2 వేలు విలువ చేసే ఎముకల సాంద్రత పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మందులు కూడా ఇస్తామన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నరసింహయ్యకు పీహెచ్‌డీ ప్రదానం


పి.నరసింహయ్య


బత్తినఅశోక్

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పి.నరసింహయ్యకు యోగివేమన యూనివర్సిటీ పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేసింది. ఈయన ఆచార్య సి.నాగరాజు ఆధ్వర్యంలో ఎర్లీ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ ఆఫ్ క్యాన్సర్ యూజింగ్ మిషన్ లెర్నింగ్ అల్గరిథమ్స్ అనే అంశంపై పరిశధన పత్రాన్ని యోగివేమన యూనివర్సిటీకి సమర్పించారు. నరసింహయ్య 3 స్కోపస్, ఒక వెబ్ సైన్స్, 3 అంతర్జాతీయ జర్నల్స్ మొత్తం 7 పేపర్స్ ప్రచురించారు. ప్రపంచంలో నూటికి 20 మంది స్త్రీలు బ్రెస్ట్ క్యాన్సర్ ద్వారా చనిపోతున్నారని నరసింహయ్య పేర్కొన్నారు. ఈ పరిశోధన వలన ముందుగా క్యాన్సర్‌ను గుర్తించి సరైన వైద్యం ద్వారా మహిళలను కాపాడవచ్చునని తెలిపారు. ఈ పద్దతి ద్వారా స్త్రీలు ఇంటి దగ్గరే క్యాన్సర్ ఉందో లేదో తెలుసుకుని డాక్టర్‌ను సంప్రదించవచ్చన్నారు. నరసింహయ్యను కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య సి.నాగరాజు, డీన్ ఆచార్య కేవీ రమణయ్య, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్, డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, పలువురు హెచ్ఓడీలు, సహాయ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

బద్వేలు వాసికి డాక్టరేట్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రఘునాథపురం గ్రామానికి చెందిన బత్తిన అశోక్ యోగివేమన విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఈయన ఫర్‌ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ ఇండియన్ మ్యూచువల్ ఫండ్స్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు ఈక్విటి లింక్డ్ సేవింగ్ స్కీమ్స్ అనే అంశంపై కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.హరనాథ్ పర్యవేక్షణలో పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించారు. వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ నల్లపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు అశోక్ తెలిపారు.

పందుల బెడద తొలగించండి


బ్రహ్మంగారిమఠంలో పందుల సమూహం

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో ఊర పందులు సంచరించడంతో స్థానికులు, వ్యాపారులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో అధికారులు పందుల పెంపకం దారులకు ఊరికి దూరంగా ఉంచాలని వాటి నిర్వహణ కోసం సోమిరెడ్డిపల్లె పంచాయతీలో నాలుగు ఎకరాలు కేటాయించారు. అయితే కొద్ది రోజులుగా దూరంగా ఉంచినట్లే ఉంచి మళ్లీ మామూలుగా బి. మఠంలో వదిలేస్తున్నారు. దీంతో పారిశుధ్యం అధ్వానంగా మారి దోమలు విజంభిస్తున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో దోమల కారణంగా అంటువ్యాధులు సోకే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఊరికి దూరంగా ఉంచాలని కోరుతున్నారు.

మొక్కలు నాటండి.. పకృతిని కాపాడండి


చాపాడు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో కలసి మొక్కలు నాటుతున్న డా.రాజేష్‌కుమార్

చాపాడు: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మండల వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ వృక్ష దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా.ఓబులేసు వైద్య సిబ్బందితో కలసి వేప, నేరేడు, జామ, కలమంద, మామిడి వంటి పండ్ల మొక్కలతో పాటు పలు రకాలైన పూల చెట్లను నాటారు. ఈ సందర్భంగా డా.రాజేష్‌కుమార్ మాట్లాడుతూ మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా పకృతిని కాపాడవచ్చన్నారు. దీని వలన భావి తరాలను మంచి భవిష్యత్తు ఇవ్వొచ్చన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఇళ్ల పరిసరాల్లో మొక్కలను నాటాలని సూచించారు. చెట్లను అధికంగా పెంచడం వలన వర్షాలు సకాలంలో సంవృద్ధిగా కరుస్తాయని, మంచి పర్యావరణ సమతుల్యం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్లు బాబురెడ్డి, సరస్వతి, ఫారసి అధికారి సుభాషిణి, యూడీసీ లోకేష్, ల్యాబ్ టెక్నీషియన్ పద్మావతి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో అధికారులు సమీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2,684 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. 30వ తేదీ ఆదివారం అయినందున 29వ తేదీ శనివారమే పంచాయతీ కార్యదర్శులు బ్యాంకుకు వెళ్లి పింఛన్ నగదును డ్రా చేసి సచివాలయ సిబ్బందికి అందజేయాలన్నారు. 6 సచివాలయాల పరిధిలో ఉన్న 47 మంది సచివాలయ ఉద్యోగుల ద్వారా వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజే వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఉదయం 6 గంటల నుంచే పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి జూలై నెలకు సంబంధించిన రూ.7 వేలకు వారికి అందజేయాలని సూచించారు. పింఛన్ల పంపిణీ కోసం అవసరమైన బయోమెట్రిక్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ రాధాకృష్ణన్, డీటీ చంద్రలీల, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమలను సందర్శించిన విద్యార్థులు


పరిశ్రమను పరిశీలిస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

మైదుకూరు : మైదుకూరు పాలిటెక్నిక్ విద్యార్థులు పట్టణ సమీపంలోని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ)లోని పరిశ్రమలను శుక్రవారం సందర్శించారు. విద్యా పారిశ్రామిక యాత్రలో భాగంగా సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాల నుంచి మొదటి, రెండు సంవత్సరాల విద్యార్థులు ఫుడ్ ప్రాసెసింగ్, పేపర్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక యాత్ర లక్ష్యం సైద్ధాంతిక అభ్యాసం, ఆచరణాత్మక అనువర్తనం మధ్య అంతరాన్ని తగ్గించడమేనని అన్నారు. ఈ యాత్ర విద్యార్థులకు వారి ఇంజనీరింగ్ రంగాల్లో ప్రాక్టికల్ అనుభవాన్ని ఇవ్వడంలో చాలా సహాయపడుతుందని పేర్కొన్నారు.

పోరుమామిళ్ల ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ఎస్ఐగా త్రిమూర్తులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2018 బ్యాచ్‌కు చెందిన త్రిమూర్తులు ఇంటలిజెన్స్‌లో పని చేస్తూ పోరుమామిళ్లకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న మల్లికార్జునరెడ్డిని కడప వీఆర్‌కు బదిలీ చేశారు.

ప్రొద్దుటూరులో సన్‌షైన్ హాస్పిటల్ ప్రారంభం


హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శాంతిరాముడు, ఎమ్మెల్యే వరద, మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని గాంధీరోడ్డులో గల మౌలానాఆజాద్‌వీధి-2 లో నూతనంగా ఏర్పాటు చేసిన సన్‌షైన్ హాస్పిటల్‌ను శాంతారామ్ మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ శాసన మండలి సభ్యుడు చదిపిరాళ్ల నారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ నజ్మాభీజాన్, డాక్టర్ కె మహమ్మద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ బీపీ షుగర్, థైరాయిడ్, ఉబ్బసం, గ్యాస్ట్రబుల్, కామెర్లు, పక్షవాతం, తిమ్మిర్లు, డెంగ్యూ మలేరియా విషజ్వరాలు, నరాల బలహీనత, విరేచనాలు, దగ్గు, టీబీ, ఆస్తమా, చికిత్సలు మరియు గర్భవతులకు హైబీపీ, షుగర్, థైరాయిడ్, బాలింతలకు సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ సేవలు, గర్భ నిరోధక సేవలు, సంతాన సాఫల్య సేవలు, తదితర జబ్బులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తామని తెలిపారు. 24 గంటల ఎమెర్జెన్సీ సేవలు ఉంటాయని తెలిపారు. డాక్టర్ సంధ్యాకుమారి, డాక్టర్ పి సత్యప్రసాద్, డాక్టర్ జీవీ మహేష్, పట్టణంలోని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రేపు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రమాణం


ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న రొటేరియన్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : రోటరీ డిస్ట్రిక్ట్ 3,160 గవర్నర్, రోటరీ పట్టణ కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఈ నెల 30న ఆదివారం స్థానిక రెడ్ల కల్యాణ మండపంలో చేయనున్నారని 2024–25 సంవత్సరానికి గవర్నర్‌గా ఎన్నికైన సాధు గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోటరీ డిస్ట్రిక్ట్ 3,160 గవర్నర్‌గా తాను, అసిస్టెంట్ గవర్నర్‌గా మల్లికార్జున, జిల్లా చీఫ్ సెక్రటరీగా జాకీర్ అహ్మద్, రోటరీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాలసూర్యారావు, శ్రీధర్ శర్మ ప్రమాణ స్వీకారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి గుంటూరుకు చెందిన మాజీ వరల్డ్ రోటరాక్ట్ చైర్ రవి వడ్లమాని, జోనల్ అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, రొటేరియన్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రొటేరియన్లు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన


పోరుమామిళ్ల: మాట్లాడుతున్న డాక్టర్ శ్రీవిద్య

పోరుమామిళ్ల: కీటక జనిత (దోమల) వ్యాధుల నివారణపై శుక్రవారం స్థానిక కేజీబీవీయస్‌లో ఉపాధ్యాయులకు, బాలికలకు మెడికల్ ఆఫీసర్ శ్రీవిద్య, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నరసింహారెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా, పైలేరియా, డయోరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు, తదితర వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయన్నారు. దోమల నియంత్రణ ద్వారా అంటువ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం, చెత్తా చెదారం డ్రైనేజీల్లో వేయకుండా జాగ్రత్త వహించడం, దోమ తెరలు ఉపయోగించటం తదితర చర్యలతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. వర్షకాల సీజన్‌లో దోమలు ప్రజలే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. ఆశాకార్యకర్తలు, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నిర్మల, హెల్త్ సూపర్‌వైజర్ నాగమ్మ, ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి, ఎస్సీ బాలికల వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : సీజనల్ వ్యాధులు, కీటకజనిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ బి.వెంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం తిరువెంగళాపురం పంచాయతీలోని ఎత్తిరాజుపల్లె గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి అనంతరం ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు, కీటకజనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ ప్రబలే అవకాశం ఉందని, ఇందుకు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. హెల్త్ అసిస్టెంట్లు జనార్దన్, శ్రీరాములయ్య, సీహెచ్ఓ హర్షిత, వైద్య సిబ్బంది మహాలక్ష్మి, వెంకటలక్ష్మి, ఓబులయ్య పాల్గొన్నారు.

ఇంటింటి ఫీవర్ సర్వే పరిశీలన

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక శ్రీనివాసనగర్‌లోని సంజీవనగర్‌లో ఫ్రైడే- డ్రైడే సందర్భంగా నిర్వహిస్తున్న ఇంటింటి ఫీవర్, లార్వా సర్వేను డీఎంఓ డాక్టర్ మనోరమ శుక్రవారం పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ దినేష్‌బాబు, శంకరయ్య, నూర్‌బాషా, శ్రీనివాసులు, హెచ్ఈ శోభారాణి, సీఓ నాగజ్యోతి, వరలక్ష్మిపాల్గొన్నారు.

పిల్లల్లో డయేరియా రాకుండా చర్యలు

పిల్లల్లో డయేరియా రాకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం స్టాప్ క్యాంపెయిన్, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేది వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ జరుగుతుందన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఐదేళ్ల లోపు పిల్లలకు డయేరియా ఉందేమో గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వరు పాల్గొన్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు సమతుల ఆహారం తీసుకోవాలని డాక్టర్ అపర్ణ శ్రీరామ్ సూచించారు. స్థానిక హోమస్ పేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆయూష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు, గొంతు నొప్పి, జ్వరం, కడునొప్పి, వాంతులు, విరేచనాలు, శ్వాసకోశ సమస్యలను వివరించారు. యూనాని డాక్టర్ నిరంజన్ నాయక్ మాట్లాడుతూ మన చుట్టు ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వారానికి ఒక సారి ఇంటిలోని తొట్లు, కుండలు, బానలు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు డీవీ రవీంద్రుడు, ఆయూష్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది మహేశ్వరయ్య, రాజారెడ్డి, రమణ, జనవిజ్ఞాన వేదిక నాయకుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు కల్చరల్ : వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అపర్ణ


పొద్దుటూరు క్రైం : ఫీవర్ సర్వే గురించి మాట్లాడుతున్న డాక్టర్ మనోరమ